5) చేమకూర వెంకటకవి- విజయ విలాసం

జ). తంజావూరు నాయకరాజుల్లో ప్రసిద్ధుడైన రఘునాథ రాయల ఆస్థానంలో చేమకూర వేంకట కవి ఉండేవాడు. రఘునాథ రాయలు కవితా పోషణ గావించి బహుముఖ ప్రజ్ఞతో అనేక రచనలు చేశాడు. చేమకూర వేంకటకవి సారంగధర చరిత్ర, విజయ విలాసము అనే కావ్యాలను రచించాడు. వీరి అసలు పేరు వెంకట రాజు. చేమకూర రచించిన ప్రతి పద్యంలోనూ ఏదో ఒక చమత్కారం ఉంటుందని, కవితామార్గం అనన్యసామాన్యం అని చెప్పవచ్చు. వెంకట కవి 17వ శతాబ్దంలో జీవించారని చెప్పవచ్చు.

**విజయవిలాసము-కథావస్తువు:**

విజయ విలాస కావ్యం మూడు ఆశ్వాసాలుగా రచింపబడింది. ఇందులో ఉలూచి,చిత్రాంగద,సుభద్రల వివాహ కథలు మూడు ఉన్నాయి. విజయ విలాసంలో చేమకూర వేంకటకవి చాలా వరకు భారత కథను అనుసరించి పాత చిత్రణ కోసం, కథాకథన సౌలభ్యం కోసం నాటక పద్ధతిని అనుసరించారు. ఉలూచి నాగకన్య, చిత్రాంగద మర్త్యకన్య, సుభద్ర దేవకన్య .

విజయ విలాసంలోని కథ ఇంద్రప్రస్థ పురాన్ని ధర్మరాజు పాలిస్తున్న సమయంలోనిది. శ్రీకృష్ణుడు దగ్గర్నుంచి యదు వంశీయుడైన గరుడు వచ్చి అర్జునునికి సుభద్ర సౌందర్యాన్ని వర్ణిస్తూ చెప్పాడు. ఒకసారి ఒక బ్రాహ్మణుడు తన గోవును దొంగలు అపహరించారని మొరపెట్టుకోగా అర్జునుడు విల్లు, బాణాలను తీసుకురావడానికి ధర్మరాజు అంతఃపురంలోకి వెళ్ళాడు. నియమం ప్రకారం అర్జునుడు భూప్రదక్షణం చేయవలసి వచ్చింది. ఆ సమయంలో అర్జునుడు ఒకసారి గంగాతీరంలో ఉన్నప్పుడు ఉలూచి అనే నాగ కన్య తనను చేపట్టమని అడిగితే ముందు తిరస్కరించినా, తర్వాత వివాహం చేసుకున్నాడు. అర్జునుడు మణిపుర ప్రాంతానికి వచ్చినప్పుడు మలయధ్వజుని కూతురైన చిత్రాంగదను చూసి, ఆమెను తండ్రి అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత అర్జునుడు

ద్వారకకు వెళ్ళి ముని వేషంలో సుభద్ర చేసిన పరిచర్యలు స్వీకరించి, శ్రీకృష్ణుని సహాయంతో సుభద్రను వివాహం చేసుకుంటాడు.

విజయ విలాసంలో ప్రతి పద్యంలోనూ చేమకూర వేంకటకవి ఏదో ఒక చమత్కారాన్ని నింపి రచించారు. యతి వేషంలో ఉన్న అర్జునుడు సుభద్ర తో మాట్లాడినప్పుడు

"బంగారు కొండ నీటిని తెమ్ము లత కూనా మంచి సుమములు తెమ్ము" అని చమత్కరించారు.

అంటే బంగారు కుండతో నీరు, లేత తీగ మొక్కల పూలు, మంచి కొమ్మకున్న పళ్ళు తీసుకు రావాల్సిందని పలికినట్లు ఒక అర్థం.

బంగారు కొండ! (సంభోధన) నీటిని తెమ్ము **లత కూన**(సంబోధన) **మంచికొమ్మ(** సంబోధన) పళ్ళు తీసుకురా అని మరొక అర్ధంలో చమత్కరించాడు.

సమయానికి తగిన రీతిలో పదాల్ని ప్రయోగించి, చమత్కారం పొందుపరిచాడు. చిత్రాంగద సౌందర్యాన్ని వర్ణిస్తూ చంద్రుడు అనడానికి చందురు అని ప్రయోగించారు.

"ఇందిందిర ఏమందము మందమున ముఖమందమునవార విందాము" అనే పదాలలోని పూర్ణ బిందు పూర్వక 'ద'కారం వీనుల విందుగా ఉంది.

**వర్ణనలో చమత్కారం:**

విజయ విలాసంలో అద్భుతమైన వర్ణనలు ఉన్నాయి. సూర్యాస్తమయాన్ని ,చంద్రోదయాన్ని ఏక కాలంలో వివరిస్తూ రచించిన కంద పద్యం సహృదయ మనోరంజకమైన ఉన్నది.

**అలంకారిక చమత్కారం:**

విజయ విలాసంలో అలంకారం లేని పద్యం లేదంటే అతిశయోక్తి లేదు. చిత్రాంగద అర్జునుల వివాహాన్ని వర్ణిస్తున్న సందర్భంలో మంగళసూత్రాన్ని అంగరాజ్యాన్ని ఏలడానికి కట్టిన తోరణమా అన్నట్లు ఊహించడంలో ఉత్ప్రేక్షను గుర్తించవచ్చు.

**రస చమత్కారం:**

విజయ విలాసంలో ప్రధాన రసం శృంగారం. ఇంకా హాస్యం, వీరం, కరుణ మొదలైన రసాలు కూడా పోషింపబడ్డాయి. సుభద్ర శరీరం వేడెక్కింది కాబట్టి ఏదో దెయ్యం సోకి ఉంటుంది. కాబట్టి సన్యాసిని చూపించాలని నవ్వింది. అది గమనించిన మిగిలిన వారికి కూడా ఆమె మాటలు నవ్వు తెప్పిస్తాయనడం సహోక్తి. ఇలాంటి రస చమత్కారాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి.

**పలుకుబడులు:**

భాష మీద అధికారం కలిగిన వాడు కావడంతో చేమకూర వేంకటకవి ఎన్నో పలుకుబడులను పద్యాలలో బంధించాడు.

‘కన్నుల కఱువు దీర'

‘ఈతకు మిక్కిలి లోతు గల్గునే'

‘కలిగెన్ భాగ్య వశంబునన్'

ఈ విధంగా విజయ విలాసంలో చేమకూర వేంకటకవి యొక్క బహుముఖ ప్రతిభ సాక్షాత్కరిస్తుంది.